

# నలుపు

మా నాయన ఒంటి రంగు నలుపు. చీకటిగడ్డ కట్టినట్లు ఉంటాడాయన. మాజేజి నాయన కూడా అట్లాగే ఉంటాడు. మా నాయన భార్య (పిన్ని), ఆమె ఇద్దరు పిల్లలు, అప్పుడప్పుడూ మా యింటికొచ్చే బంధువులు, మా చుట్టుపక్కల ఇళ్ళలో వాళ్ళూ అందరూ నలుపే. నేనొక్కదాన్నే తెల్లగా పాలిపోయినట్లుగా ఉంటాను. నా వాళ్ళందరిలాగా కాక, యిలా ప్రత్యేకంగా ఉండే నా ఒంటిరంగు నాకు దిగులు కలిగించేది. 'మీయమ్మది దబ్బపండు సాయ. దాని రంగే నీకు వచ్చింది' అని మా బంధువుల్లోని ముసలమ్మలు నా బుగ్గలు సాగదీస్తుంటే నాకు వింతగా ఉండేది.

నేను, మా అమ్మ మా జాతి మనుషులుగా పూర్తిగా రూపుదిద్దుకోకుండానే ఈ భూమిపైకి తోసివేయబడ్డామేమో ననిపిస్తుంది.

నా స్కూలు జీవితం, నా చదువు కూడా నాకు ఆందోళన కలిగించేవి. "పిల్ల చాకు! పాదరసంలాంటి బుర్ర! ఒక్కసారి చెబితే చాలు యిట్టే గ్రహిస్తుంది. వాళ్ళలో ఆపాటి చదివే వాళ్ళేరీ?" అనేవాడు మా స్కూలు అయ్యవారు. 'వాళ్ళలో' అనే మా ట నన్నెందుకో భయానికి గురిచేసేది. బానిసత్వం, అణచివేత, నరమేధం లాంటి మాటలు విన్నప్పుడు కలిగే ఉలికిపాటు, భయం, 'వాళ్ళలో' అనే మాట విన్నప్పుడు కూడా కలిగేది. (చాలాసార్లు నా పరీక్ష పేపర్లలో కావాలని తప్పులు రాసేదాన్ని. టీచర్లు అడిగే ప్రశ్నలకు తెలిసినా తెలియనట్లు తల ఊపేదాన్ని).

మా ఇంటికీ, బడికీ ఐదు మైళ్ళ దూరం. మేం మొత్తం పన్నెండు మందిమి. ఆడపిల్లలు నలుగురు, మేమందరమూ కలిసే వెళ్ళాలని మా పెద్దవాళ్ళు చెబుతుంటారు. "ఒక్కదానివే ఎప్పుడూ రావద్దు!" అని నాయన రోజూ చెబుతుంటాడు. అడవులు లేవు, పెద్దపులులు లేవు. మనుషులే! పెద్దవాళ్ళు చెప్పే ప్రమాదమేమీ కనబడేది కాదు. రోజూ వినీ వినీ ఈ 'భయపడటం' అనేది మాకు సహజమైన అనుభూతి అయ్యేది.

తోవలో జామ తోటలు. పండి, మగ్గి దోవ పొడవునా మధురమైన వాసన. కోరిక ఆపుకోలేక అందరం తోటలోకి దూరాం ఒకసారి. లంగా పైకి గోసెలాగా కట్టుకొని చెట్టు ఎక్కాను. ఇంకో ఇద్దరు మగపిల్లలు కూడా ఎక్కారు. కాయలన్నీ దులిపివేశాం. కావలివాడి అరుపులు విని వాళ్ళిద్దరూ చెట్టు దూకి పారిపోయారు. మిగిలిన పిల్లలూ పరుగు ఎత్తుకున్నారు. చెట్టుపై నుండి దూకడానికి భయంవేసి నేను కావలివాడికి దొరికిపోయాను. వాడు నా జుట్టు పట్టుకొని ఈడ్చి..... ఆవేళ వాడు తిట్టిన తిట్లు నేనెన్నడూ వినలేదు. లైంగిక క్రియలో హింస ఉందని, లైంగిక హింస మగవాడికొక ఆయుధమని అర్థమయీ, అర్థంకాక, ఆవేళ ఆ తిట్ల ద్వారా నాకు తెలియవచ్చింది.

మా నాన్న భార్యకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడికి ఆరేళ్ళు. ఇంగ్లీషు బడికి వెళుతుంటాడు. రెండోది నాలుగేళ్ళ పిల్ల. అదెప్పుడూ చింపిరి చింపిరిగా దిగులుగా ఉండేది. దానికి తల్లి ఉండీ, నాకు నేను, తాను అనాథలుగా బతుకుతున్నట్లు అనిపించేది. మా నాన్న భార్యపై నాకెంతో

ద్వేషం ఉండేది. ఆమె కొడుకుపై కూడా. కానీ ఆ పిల్లంటే నాకెంతో జాలీ, సానుభూతి. అఆలు సరిగ్గా రాలేదనే నెపంతో దాన్ని స్కూలు ఆపేశారు. స్కూలు కెళ్ళటంలేదు కదా అని మంచిబట్టలు తెచ్చివ్వటం ఆపివేశారు. అట్లాంటి పరిస్థితే నాకూ దాపురించింది. ఒకసారి (నాకు పన్నెండేళ్ళప్పుడు) ఎర్రటి, చిక్కటి రక్తంలాంటిదేదో తడితడిగా నా కాళ్ళ మధ్య నుంచి ఉబికింది (నా మొదటి మెన్సెస్ రక్తం). కొంచెం భయం! కొంచెం ఆశ్చర్యం! దాని గురించి ఎప్పుడూ విన్లేదు నేను. రాబోయే గొప్ప ప్రమాదానికి ఇదేమన్నా సూచనేమో అని భయపడ్డాను. ఒక అక్కను మాత్రం అడిగాను (మా సీనియర్). ఆ అక్క దానిని గురించి వివరించాక, దానితోపాటు జరిగే తంతును చెప్పాక, ఆ విషయం ఇంట్లో చెప్పకూడదని నిర్ణయించుకున్నాను. రక్తంతో తడిసిన లంగాను ఉతుక్కుంటూ ఉండగా మా నాన్న భార్య కళ్ళలో పడ్డాను. గొప్ప ఆపద వచ్చినట్లుగా ఇంటిల్లిపాదీ తలకిందులయ్యారు. బడి మాన్పించాలని మా నాన్న భార్య పట్టుపట్టింది. ఆమె దూరపు బంధువొకడు (మద్రాసులో కక్కసుదొడ్లు కడిగే ఉద్యోగం), ముప్పయి యేళ్ళయినా పెళ్ళి కాకుండా ఉన్నాడట. (సిటీవాడు కదా! రంగున్న పిల్ల కావాలట) వాడికి కబురు చేసి నన్ను వాడికిచ్చి పెళ్ళి చేయాలని పట్టుపట్టింది. ఆ రాత్రికి గన్నేరు పప్పులు తెచ్చుకుని, మెత్తగా నూరుకొని మొత్తం తాగేశాను. వారం రోజులకు గానీ కళ్ళు తెరవలేకపోయాను. మా నాయన "నాకూ కాస్త పెడితే - ఇద్దరం కలిసే చచ్చేవాళ్ళం కదరా తల్లీ!" అంటూ ఏడ్చాడు. ఆవేళ నేను చేసిన పనికి నేను సిగ్గుపడలేదు. కానీ అట్లా ఎందుకు చేశానా అని ఇప్పుడాలోచించుకుంటే బహుశా మా నాన్న భార్యపై ద్వేషమే అనుకుంటాను. ఆమె అనే పీడకలను, ఆమె బంధువు రూపంలో ఎల్లకాలం భరించాలనే భయమేమో! అంతేకాదు. ఇంకో భయం కూడా తెలిసీ తెలియనట్లుగా బహుశా కావలివాడు ఆవేళ తిట్టిన తిట్లలోని లైంగిక హింస కూడా గుర్తుకొచ్చి ఉంటుంది.

టెన్త్‌క్లాసు నేను ఫస్ట్‌క్లాసులో పాసవటం మా పల్లెలో పెద్ద వింత. మా పల్లే కాదు. మా ఊరికి అటూ, ఇటూ ఉన్న చాలా పల్లెల్లో కూడా అదో ముచ్చటైంది. (స్కూలు ఫస్ట్ కూడా నేనే మరి!) "పిల్లనింకా చదివించు! బాగా పైకొస్తుంది. ఇంటరు కూడా ఇట్లాగే చదివితే దానికి డాక్టరు కోర్సు గ్యారంటీ! మీవాళ్ళలో అది మొదటి డాక్టరవుతుంది! చదువాపమాక! పైగా దాని చదువుకు పైసా ఖర్చు ఉండదు. సోషల్ వెల్ఫేరు హాస్టళ్ళున్నాయి. తిండీ, వసతి ఫ్రీ. ఫీజులుండవు. పుస్తకాలు వాళ్ళే కొనిస్తారు. వారానికో, రెండు వారాలకో మీరెళ్ళి దాన్ని చూసి వస్తూ ఉండొచ్చు!' ' మా సారు మాటలు మా నాయనపై బాగా పనిచేశాయి.

షెడ్యూలు తెగలు, షెడ్యూలు కులాలు అనే మాటను మొదటిసారిగా టౌన్ కొచ్చినప్పుడే విన్నాను. నన్ను గురించినదేదో చరిత్రను, నా నుంచి దాచివేసినట్లుగా మొదటిసారిగా తెలుస్తున్నట్టుగా అనిపించేది. కాలేజీలో ఈ మాటల్ని అవమానానికి, చిన్నబుచ్చడానికి ప్రతీకలుగా వాడతారని కూడా నేను తెలుసుకున్నాను. ప్రతి వ్యక్తికీ తన గురించి, తన జాతి లేదా తెగ గురించిన చరిత్ర గర్వకారణంగానే ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా తమ గురించి తాము మాట్లాడకపోవటం అనే శిక్షను తమపై తాము విధించుకోవడం నేను గమనించాను. హాస్టలు పరిస్థితి కొంచెం బెటరు. అటు నుంచి, ఇటు నుంచి నాలుగు మూలల నుంచి సమీకరించడిన ఎంతోమంది నాలాంటి పిల్లలు నాకెంతో ఊరటనిచ్చారు. అయితే ఇక్కడా నా శరీరపు రంగు

నాకు మళ్ళీ దిగులును కలిగించేదిలా ఉండేది. "నువ్వు చాలా అందంగా వుంటావు!" "నీది మంచి కాంప్లెక్షన్!" "నువ్వు 'వాళ్ళ' అమ్మాయిలా ఉంటావు!" లాంటి మాటలు నన్ను వింత భయానికి గురిచేసేవి.

'గాసిప్' గురించి, దాని తీవ్రత గురించి, హాస్టల్‌లోనే నాకు తెలిసి వచ్చింది. నిజాలతో, నిరూపణలతో పనిలేదు. ఊహకు కాస్త రంగులు, దినుసులు వేసి ఒక థ్రిల్లింగ్ స్టోరీని తయారుచేస్తారు. ఈ గాసిప్‌లో ఎక్కువగా వినబడేది వార్డన్ మేడమ్ గురించి. మెల్లగా, కీచు గొంతుతో మాట్లాడుతుంది ఆమె. శరీరంలోని బలమంతా తోడేసినట్లుగా, ఊగులాడుతూ ఉంటుంది (చెక్క మేడమ్!) ఆవిడతో మాట్లాడాలంటే ఎందుకో భయం వేసేది. ఆమె కళ్ళు భయం గొల్పేలా ఉంటాయి. ఆ కళ్ళు ఆవిడవి కానట్లుగా, ఏ శవానివో కళ్ళు పీకి అక్కడ అతికించినట్లుగా ఉంటాయి. ఆమె భర్త ఎనుబోతులా ఉంటాడు. బాన కడుపు, పొడవు మెడ, చాట ముఖం, మనుషుల్ని తినే జాతికి చెందినవాడులా వుంటాడు. మా గాసిప్‌లో అతగాడే విలన్! సరదా కబుర్లతో మొదలయ్యే గాసిప్ ఒక్కోసారి వింత భయంగా ముగుస్తాయి. ఆత్మహత్య చేసుకున్న పూర్ణ అనే అమ్మాయి గురించిన కథలు నాలో దిగులును, భయాన్నీ కలుగజేశాయి.

అవమానం, బానిసత్వం, నరమేధం లాంటి మాటల్ని వింటున్నప్పుడు కలిగే ఉద్వేగం, ఆందోళన - ఆ హాస్టలు పిల్లలు అనే మాటలు విన్నప్పుడు కూడా కలిగేవి. ఇదో కొత్త అనుభవం. కాలేజీకి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చేవరకు ఒక తప్పనిసరైన శిక్షను అనుభవిస్తున్నట్లుగా ఉండేది. కొందరి చూపులు వెంటాడే బాణాల్లా ఉంటాయి. కొన్ని మాటలు లోపల కంటా దిగబడిన కత్తుల్లా ఉంటాయి.

రమేష్ అనే ఇంగ్లీషు లెక్చరరు అతనంటే గొప్ప ఆరాధన నాకు. అద్భుతమైన కాల్పనిక ప్రపంచాన్ని కళ్ళ ముందుంచుతాడు. సజీవ నాటకాన్ని వింటున్నట్లుగా ఉంటుంది అతని పాఠం. ఇంగ్లీషుపై కాస్త పట్టు వచ్చిందంటే ఆయన వల్లనే. ఒక శనివారం" రేపు సండే మా యింటికి 'టీ'కి రాకూడదా?" అని ఆహ్వానించాడు. ఆ ఆహ్వానానికి పొంగిపోయాను. ఆదివారం ఉదయం ముసిరిన మబ్బు, మూగ ఎండ, చల్లనిగాలి. ఆకుపచ్చ ఓణీ, ఎర్రగాజులు, నుదిటిపై టెన్షన్ తాలూకు చిరుజల్లులు - "రా! లక్ష్మీ! లోప లికి!" అంటూ ఆహ్వానించాడు. ఇల్లంతా బోసిగా ఉంది. సెట్టింగ్‌లన్నీ పీకేసిన స్టేజీలా ఉంది. ఊడవని గదులు, మాసిన బట్టలు - "మీ మేడమ్ ఊళ్ళో లేదు. అందుకే ఇల్లంతా కంగాళీగా ఉంది!" కాఫీ సిప్ చేస్తుండగా చెప్పాడు. "నీలో గొప్ప స్పార్క్ ఉంది. బ్రైట్ ఫ్యూచరుంది నీకు" నా కళ్ళలో ఆనందం, గర్వం - కానీ ఎందుకో అర్థం కాని భయం కూడా కలిగింది. ఆయన నా దగ్గరగా వచ్చి నా చుట్టూ చేతులు వేసి, ఆ చేతుల్ని పాముపిల్లల్లాగా చాతీలోకి పాకిస్తూ - విదిలించుకొని దూరంగా జరిగాను. "వెళ్తాను సార్!" "ఏమిటి బెట్టా! మీ హాస్టలులో ఇట్లాంటివి మామూలేగా" "బాస్టర్డ్!" అని తిట్టానా? లేదు తిట్టలేకపోయాను. పెద్ద పెట్టున ఏడ్చాను. దు:ఖంతో, అవమానంతో ఏడ్చాను. బాల్యం నుంచీ, నన్ను భయపెట్టే అవమానం. వాళ్ళు అనే పేరుతో, ఆడపిల్ల అనే పేరుతో, ఇవాళ కొత్తగా ఆ హాస్టలు పిల్ల అనే పేరుతో.

కారణం రమేషో, మరెవరో తెలియదు. కాలేజీలో నా గురించిన ప్రచారం. "పెద్ద కేసు గురూ" "మొన్న శంకర్ లాడ్జి దగ్గర చూశాను!" "హంద్రెడంట! మనకేమన్నా కన్సెషన్ ఇస్తుందేమో!'

'హాస్టలుకు నా పేరుతో ఉత్తరాలు వచ్చేవి. జుగుప్సగా, అసభ్యంగా! వార్డెన్ కూడా వాటిని చదవలేకపోయేది.

కొలిమి నిప్పుల్ని మోసినట్లుగా ఇట్లాంటి అవమానాల్ని మోస్తూ చదివే ఈ చదువు అవసరమా అనిపించేది! చదువుమాని.... ఆ తరువాత జీవితం కూడా పెద్దగా ఆసక్తికరంగా తోచలేదు. మద్రాసు సంబంధం నా కోసం ఇంకా కాచుకునే ఉంది.

ఒక సెలవురోజు సాయంత్రం హాస్టలు మధ్యనున్న ఫౌంటేన్ దగ్గర కూర్చున్నాను. అటూ ఇటూ క్రోటన్ మొక్కలు. అంతగా వాసనరాని డాలియా పూలు. ఒకే ఒక్క చామంతి పొద పసుపు పచ్చగా విరిసిపూలతో కిలకిలలాడుతోంది. చీకటి సన్నసన్నగా పాకుతోంది. ఆవేళ ఉదయం నుంచీ హాస్టలులో కరెంటు లేదు. రూమ్‌లలో ఉండలేక మరికొంత మంది పిల్లలు కూడా బయటకు వచ్చారు. చీకటి నిశ్శబ్దంగా, దిగులుపడ్డ మనసులా ఉంది. చిరంజీవి సినిమా గురించి ఒకచోట, వార్డెన్ మేడమ్ హాస్టలు వస్తువులు అమ్ముకునే విషయం గురించి ఇంకోచోట లోగొంతుకలో కబుర్లు వినబడుతున్నాయి. ఆ చీకటిలో, దూరం నుంచి ఒక రూపం చాలాసేపటి నుండి నావైపు చూస్తున్నట్లుగా అనిపించి ఉలిక్కిపడ్డాను. మరీ పిరికిదాన్నయి పోయాననుకుని మనసును సమాధానపెట్టాను. కెవ్వుమంటూ వెనక పొదలోంచి వినబడిన కేకతో భయంగా లేచాను. బలంగా నోరు మూసినట్లు, ప్రపంచానికి వినబడని నిస్సహాయపు కేకలు. మూలుగు రూపంలో నా చెవినబడ్డాయి. "అక్కా....!" పూర్తిగా వినబడని మరో రెండు కేకలు. విసురుగా ఆవైపు వెళ్ళబోయేంతలో రెండు బలమైన చేతులు నన్ను చుట్టుముట్టాయి. ఒక చెయ్యి నా నోరుమూసి, రెండో చెయ్యి నా డొక్కలో ఫెడేల్మని పొడిచి - దుర్భరమైన భయం, బాధ తన్నుకు వచ్చాయి. పొదలవైపుకు లాక్కు వెళుతుండగా, సర్వశక్తుల్ని సమీకరించి పెనుగులాడాను. కనపడని దేవుళ్ళని ప్రార్థించాను. ఒక సహాయం కోసం! నోటిపైన చెయ్యి అట్లానే ఉంచి, ఆ అజ్ఞాత మృగం నాపైన దాడి చేసింది. కత్తితో చీల్చినట్లుగా అతి భయంకరమైన నొప్పి. గాయం శరీరానికో, మనసుకో తెలియనట్లుగా ఉంది. దు:ఖం అలలా చెలరేగి "అమ్మా!" అంటూ పెనుకేక వేశాను. అది నోటిపై అదిమిపెట్టిన మృగపు చెయ్యిని సైతం చీల్చుకొని హాస్టలంతా మారుమోగింది. దూరంగా వాచ్‌మెన్ కేక. "ఎవరక్కడా! ఎవరక్కడా!" "అక్కా! అక్కా ఏమైంది!' 'గదుల్లోంచి మిగిలిన పిల్లల అరుపులు! మృగం నన్ను వదిలి పొదల మధ్యగా కాంపౌండ్ వైపు పరిగెత్తింది. గోడ దాటుతుండగా అతని రూపం లీలగా తోచి ఉలిక్కిపడ్డాను. ఇంగ్లీషు సార్‌లా తోచి, కాదు, కాదని మనసు గోల పెట్టింది. హాస్టలు పిల్లలందరూ ఫౌంటేన్ చుట్టూ మూగారు. సిగ్గుతో, అవమానంతో, పెను దు:ఖంతో, మొత్తం ఆరుగురం! కొంచెం ధైర్యంగా ఉంది నేనే! పాలిపోయి గజగజ వణికిపోతున్నారు మిగిలినవాళ్ళు.

నిస్త్రాణంగా, నిర్జీవంగా, భూమిపై బలంగా దిగ్గొట్టబడ్డ ఒకానొక హింసాత్మక దృశ్యంలా ఉన్న మమ్మల్ని పైకి లేపి గుండెలకత్తుకొని లోపలికి తీసుకెళ్ళారు వాళ్ళు. ఒకళ్ళకొకళ్ళం పొగిలి పొగిలి ఏడ్చాం. ఆ రాత్రి ఎవరూ నిద్రపోలేదు. అందరం ఒక గదిలోనే కూర్చున్నాం. వాచ్‌మెన్ ద్వారా పాలు, టీ పొడి తెప్పించి, వేడిగా టీ చేసి పెట్టిందొక పిల్ల. వార్డెన్ ఇంట్లో లేదు. వాచ్‌మెన్‌తో కబురు పెట్టాం.

రాత్రంతా వార్డెనొస్తుందేమో అని చూశాం. రాలేదు. అపరాత్రివేళ వర్షం మొదలైంది.

నిలబెట్టి కురిసింది. ఉదయానికి కూడా వాన తగ్గలేదు. పగటిపూట కూడా వార్డెన్ మేడమ్ రాలేదు. ఉదయం టిఫిన్‌కి ఎవరం లేవలేదు. శరీరాల్ని అట్లాగే నేలపై కూలవేసి శవాల కుప్పల్లా గదిలో పడి ఉన్నాం అందరం.

ఆవేళ పగలు, రాత్రి కూడా వాన కురుస్తూనే ఉంది. సాయంకాలానికి వానలోంచి శవం నడుచుకు వచ్చినట్లుగా వార్డెను వచ్చింది. "ఎవరు వాళ్ళు? ఎవరువాళ్ళు?" "తెలిసినవాళ్ళా? కొత్తవాళ్ళా" "ఎప్పుడూ ఇట్లా జరగలేదే?" తనలో తాను ప్రశ్నలు వేసుకొని, ఎటువైపు నుండీ సమాధానం రాకపోయేసరికి కాసేపు మౌనంగా అయింది. తనలో తాను ఏదో గొణుక్కుంది. నుదిటికేసి టప్, టప్ మంటూ నాలుగైదు సార్లు కొట్టుకుంది. పదే పదే దీర్ఘంగా నిట్టూర్చింది.

"మీరు పిల్లలు! ఇంకా జీవితం గురించి ఏమీ తెలియదు! ఇదేముంది? ఇంకా ఎంత నరకం అనుభవించాల్సి ఉందో? ఇది మగలంజాకొడుకుల లోకం. వాడు కసాయివాడు! కిరాతకుడు! మగ నా కొడుకుల్లో మంచోడెవరయినా ఉన్నాడని ఎవరన్నా అంటే వాళ్ళ ముఖంపై ఊస్తాను. నాకు తెలుసు! నేను ఇట్లాంటి బాధను అనుభవించినదాన్నే! ఆడమగ అందులో తెగ సుఖం ఉందని కవులు, రచయితలు రాస్తూ ఉంటారు. సుఖం కాదు రక్తాన్ని తోడేయటం. పైనపడి తినడం. నాకు పెళ్ళయి పదేళ్ళయింది. పిల్లలు లేరు. పుట్టరు కూడా. శవాలకు పిల్లలెట్లా పుడతారు. ఒకసారెప్పుడో ఒక నెల ముట్టు కాలేదు. నిప్పుల కుండలాంటి కషాయాన్ని తాగాను. వరసగా నాలుగురోజులు తాగాను. రక్తపు ఏరులై అది నా శరీరాన్ని వదిలి మురికి కాలవలోకి పారింది. నా వంశం, నా జ్ఞాపకం అంటూ నా మొగుడు తెగ ఎగిరాడు. "థూ! నా కొడకా! నీతో కాపరం చేయటమే గొప్ప పాపం, పైగా నీకు పిల్లల్ని కనడమా?" అనుకున్నాను.

"పిచ్చిగా మాట్లాడుతున్నాననుకోవద్దు! నా మనసు పాడయింది. సరిగ్గా మీ వయసులో ఉన్నప్పుడు నా మొగుడు నన్ను బలిమిన చెరిచాడు. అప్పుడు, వాడు మా ఇంట్లో అద్దెకుండేవాడు. వాడి కాళ్ళా వేళ్ళా పడి వాడికి నన్నిచ్చి పెళ్ళి చేశారు మావాళ్ళు"

"సరే, అయిపోయిందేదో అయిపోయింది. మీరెందుకు ఏడవాలి? ఇప్పుడేం కొంప మునగలేదు. ఆకాశం కూలిపోలేదు. పసిమొగ్గలు మీరు. పాపమంతా ఆ నాబట్టలదే. ముట్టుతో తడిసిన గుడ్డల్ని విసిరి డస్ట్‌బిన్‌లో వేస్తామే, అట్లాగే జరిగినదాన్ని 'ఛో! నాబట్టా!' అనుకొని మరిచిపోండి'

"లేవండి. లేచి స్నానం చేయండి. నిండుగా తలస్నానం చేయండి. అన్నీ అందులో కొట్టుకుపోతాయి. తలవంచుకు నడిచిపోతుంటే, పై నుంచి కాకిరెట్ట వేసింది. కడుక్కున్నాం. పోయింది. ఇదీ అంతే"

"దీని గురించి దిగులూ వద్దు. దు:ఖమూ వద్దు. అసలెవరూ దీన్ని గురించి మాట్లాడుకోవద్దు. మామూలుగానే రేపట్నించి కాలేజీకి వెళ్ళండి"

మమ్మల్ని బలవంతాన లేవదీసి, బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళి తనే స్నానం చేయించింది. తల తుడిచి, జుట్టు ఆరబెట్టింది. గదుల్లోకి అన్నాన్ని తెప్పించి, అందరికీ అన్నం పెట్టింది. ఆ రాత్రి మాతోనే పడుకుంది. ఏవో కథలూ, కబుర్లూ చెబుతూనే ఉంది. ఎప్పుడో వేకువజామును నిద్రపట్టింది.

కాకిరెట్టలాగో, పీడకలలాగో ఆ సంఘటనను మరచిపోలేకపోతున్నాను. ఆవిడ చెప్పినంత

సులభంగా తీసుకోలేకపోయానా సంఘటనని.

అది దు:ఖమో, కోపమో, అవమానమో - ఆత్మని దహించివేసే మహాగ్ని నాలో నిత్యం రగులుతుండేది. తూనీగలాగో, వెన్నలలాగో, చిరుముద్దులాగో, బిడియపడే అజ్ఞాత లైంగిక స్వప్నంలాగో ఉండాల్సిన వయసులో స్త్రీల దు:ఖ చరిత్రలు, లైంగిక హింసలాంటి సీరియస్ విషయాల గురించి ఆలోచించుకోవాల్సిన మానసిక స్థితిలోకి వచ్చాను. రహస్యం! గోప్యం! అణచివేత! అన్నీ దాచుకోవాల్సిందే. పుండు సలుపుతున్నా ఏం జరగనట్లే నవ్వుతూ ఉండాలి.

ఒకరోజు హాస్టల్ అడ్రస్‌కు ఒక ఉత్తరం వచ్చింది. "గొప్ప మజాగా ఉంది కదూ. వాటే బాడీ ఎంత సెక్సీగా ఉన్నావో. మళ్ళీ కావాలనిపించటంలేదా? మైడియర్ బిచ్! ఇవాళ సాయంత్రం పార్కులో (టాయ్‌లెట్స్ వెనక) కలుసుకుందాం. మరోసారి" - "సీక్రెట్ లవర్". ఒళ్ళంతా చెమటలు పట్టాయి. కాళ్ళు వణుకుతున్నాయి. భయం, దు:ఖం, కోపం ఎగిసి వస్తున్నాయి. హఠాత్తుగా వివస్త్రనైపోయినట్లు - ప్రపంచం ఎదుట నగ్నంగా నిలబడ్డట్టు ఏడుస్తూ కూర్చున్నాను. ఎవరు, ఎట్లా ఈ పరిస్థితి నుంచి నన్ను కాపాడుతారు? ఈ కీచకుల్ని, నరకాసురుల్ని సంహరించ డానికి ఎవరు ముందుకొస్తారు.

పోలీసులకో, ప్రిన్సిపాలుకో రిపోర్టు ఇద్దామంటే వద్దంటుంది మేడం. "వాళ్ళూ మగవాళ్ళే కదా! నీపై అనుమానంతో మొదలవుతుంది ఇన్వెస్టిగేషన్" అంటుంది. దాచాలి! అంతా దాచాలి! కక్కసు దొడ్డిలోకి మలాన్ని జార్చినట్లు. అవమానాల్ని లోపలికి తోసేయాలి! "రచ్చవుతుంది జీవితం పాడవుతుంది!" - డామ్! నాన్సెన్స్ ఎంత దౌర్భాగ్యమైన బతుకు యిది!

ఉత్తరాన్ని చించి టాయ్‌లెట్ లో వేశాను.

వారం తిరక్కుండానే లైబ్రరీ గోడలపై బొమ్మలు నీలిరాతలు. బట్టలులేని అమ్మాయిల బొమ్మలు. వాటికి యారో మార్కులు వేసి - లక్ష్మీ, లీల, మేరి, కౌసల్య అంటూ. తలనేలకేసి బాదుకోవాలనిపించింది. 'స్పెషల్ కోచింగ్ ఫర్ సెక్స్' - 'కాంటాక్ట్ వెల్ఫేర్ హాస్టల్' - 'చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మి'. కత్తితో అక్కడిక్కడే నా శరీరాన్ని చీల్చేసుకోవాలని, లేదా అదేదో పురాణంలో లాగా భూమి చీలి అందులోకి అట్లాగే దిగబడిపోవాలని అనిపించింది.

"మీరు బెదిరిపోతారేమోనని వాళ్ళ ఆశ. మీరేం బెదరవద్దు. మీరిక్కడికి వచ్చింది చదువుకోడానికి. అది పూర్తి చేసుకొని వెళ్లండి. ఇవన్నీ పట్టించుకోవద్దు. మన హాస్టలు పిల్లలనేముంది? ఆడపిల్లల బతుకులన్నీ ఇట్లాగే ఉన్నాయి. బస్సుల్లో, సినిమాహాల్లో, రోడ్లపై ఇదే బూతు పురాణం. పట్టించుకోకపోవటం. సమయం చూసి చెప్పు తీసుకొని కొట్టటం. అదీ కావల్సింది. ఇంకా కసిగా చదవండి. ఫస్ట్ క్లాసు తెచ్చుకోండి" మామూలుగానే వార్డెన్ మేడం లెక్చరిచ్చింది.

మరోసారి అతను రమేష్, ఇంగ్లీషు సార్.

"సాయంకాలం ఒకసారి ఆడిటోరియంవైపు వస్తావా? అరుద్దాటిన తరువాత?" కీచకుడు, నర్తనశాల మనసులో మెదిలాయి. సాయానికి వచ్చే భీముడే లేడు. లొంగిపోవడమో, పోరాడటమో తేల్చుకోవాలి.

కప్పెర కప్పెరగా చీకట్లు. అక్కడక్కడా దీపాలు. లైబ్రరీలో కాస్తంత అలికిడి. పరీక్ష పురుగులు. క్లాస్ రూములన్నీ నోళ్ళకు తాళాలు వేసుకున్నాయి. నీతిశాస్త్రాలు, కథలు,

కాల్పనికాలు, చరిత్ర, రాజనీతి, ఆర్థికనీతి బోధించి బోధించి అలసిపోయిందా కాలేజీ. ఆడిటోరియంలో సన్నగా వెలుగుతున్న దీపం. ఎదురు చూస్తున్నట్లుగా ఇంగ్లీషు సారు.

"లక్ష్మీ! ఏమిటిట్లా అయింది. భవిష్యత్తు అంతా నాశనం చేసుకున్నావే. ఎవరి నోట్లో విన్నా నీ గురించే! రోజూ నీ గురించే ఆలోచిస్తున్నాను. ఆ రొంపిలోంచి నిన్ను ఎట్లా బయటకు లాగుదామని - నాకు తెలుసు! నువ్వు ఇన్నోసెంటువని"

అతని ముఖంలో ఆవేదన. కళ్ళలో నీళ్ళు. ఇది నాటకశాల కదా!

"లక్ష్మీ! బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఆవిణ్ణి కూడా ఒప్పిస్తాను. నీపై మచ్చ తొలగిపోవడానికి ఇంతకన్నా దారి కనబడలేదు. బాగా ఆలోచించుకో. బలవంతమేమీ లేదు"

అతను దేనికోసమో వెతుకుతున్నాడు. నా ముఖంలోని భావాలకోసమేమో, ఒక నిట్టూర్పు విడిచి, ఒక అడుగు ముందుకు వేశాడు. బహుశా నన్ను దగ్గరకు తీసుకోవడానికి కాబోలు. అతను ఇంకో రెండు అడుగులు ముందుకు వేస్తుండగా, ఆడిటోరియంలోకి ప్రిన్సిపాల్ సార్, వైస్ ప్రిన్సిపల్ సారు, మా వార్డెను మేడం వచ్చారు. అతను ఉలిక్కిపడ్డాడు కాని భయపడలేదు. వార్డెను మేడం కళ్ళలో నిప్పులు రగిలాయి. ఈడ్చి అతని చెంపపై కొట్టింది. కోపం ఆపుకోలేక అతని జుట్టు పట్టుకులాగి - ప్రిన్సిపాల్ సారు ఆమెను ఆపాడు. నా దగ్గర స్టేట్‌మెంటు తీసుకున్నారు. హాస్టలులో జరిగిన ఘోరంతో సహా అన్నీ వివరంగా రాసి యిచ్చాను.

కీచక వధ జరిగినట్లేనా?

మనసు తేలికపడింది. కానీ స్పష్టంగా చెప్పుకోలేని భయంతో గుబులు గుబులుగా ఉంది.

కీచకుడు మరణించినట్లేనా?

గొప్ప వార్త కోసం మరుసటి రోజంతా ఎదురు చూశాను. ఏమీ జరగలేదు. రెండోరోజు, మూడో రోజు కూడా గడిచిపోయాయి. నాలుగురోజు ఇంగ్లీషు క్లాసుకు మళ్ళీ అతనే వచ్చాడు. ఆ సాయంత్రం మేడమ్ చెప్పింది.

"దిక్కుమాలిన రోజులు! దిక్కుమాలిన కాలం. వాడో ఎమ్మెల్యేకి చుట్టమట. నోరు మెదిపితే నన్ను ఉద్యోగంలోంచి తీసివేస్తామని బెదిరించారు. స్టేట్‌మెంట్లు, సాక్ష్యాలు అన్నీ మసి చేశారు. ఇది దయ్యాలు పాలించే కాలం. తలవంచుకు నీమానాన నువు వెళ్ళు. ఈ రెండు నెలలు ఉగ్గబట్టుకుంటే, ఆ పరీక్షలు కాస్తా రాసి సర్టిఫికెటుతో వెళ్ళుదువుగాని. రోజులిట్లాగే ఉన్నాయి. కాలేజిలిట్లాగే ఉన్నాయి. అంతటా దుర్మార్గులదే కాలం"

"మరొక్కమాట! కాస్త జాగ్రత్తగా ఉండే తల్లీ. ఆడు పగబట్టి ఉన్నాడు!"

భయం భయంగా గడిచాయి రోజులు. ఒంటరిగా రోడ్డు పైకి వెళ్ళాలంటే భయం. ప్రతిక్షణం ఎవరో తరుముతున్నట్లుగా హింసాత్మకమైన ఒక దృశ్యం ఎప్పుడూ వెంటాడుతూ ఉండేది. ఒక పదును కత్తి, ఒక యాసిడ్ బాటిల్, ఒక లైంగిక హింస తలచుకొని భయంతో కొయ్యబారేదాన్ని. నిద్రపట్టేది కాదు. కాలేజీకి వెళ్ళేదాన్ని కాదు. ఊపిరి బిగబట్టుకొని ఒకరోజు లోంచి ఇంకో రోజులోకి బరువుగా అడుగులు వేసేదాన్ని. ధైర్యం, ధైర్యం కావాలి. ఎక్కడ దొరుకుతుందది? గట్టిగా మూసేసిన తలుపు వెనక పొర్లి పొర్లి ఏడ్చిన దు:ఖపు తెర తరువాత,

సన్నగా గుండెలో రెపరెపలాడేది. అప్పుడు వెళ్ళి ఏ కలెక్టరుకో మెమొరాండంలా ఇద్దామనిపించేది. ఏ వార్తాపత్రికకో నా దు:ఖ కథనం రాసి పంపాలనిపించేది. కానీ ఈ ధైర్యపు కవచం క్షణాల్లో అదృశ్యమయ్యేది. రాక్షసుడు ఎక్కడో పొంచి ఉంటాడు. వాడిని ధ్వంసం చేయగల శక్తులు ఎక్కడ నుంచి వస్తాయి నాకు.

పరీక్షలింకా నెలరోజులు. ఒకరోజు మేడమ్ పిలిచింది. "ప్రీ ఫైనల్ పరీక్షల్లో రెండు సబ్జెక్టుల్లో నీకు ఫస్ట్ వచ్చిందట! వచ్చే వారం కాలేజీ డే ఫంక్షన్‌లో నీకో ప్రైజు కూడా. కంగ్రాట్స్. ఇదో విజయగాథలాంటిది. ఇంత గొడవ, ఇంత సఫరింగ్‌లో కూడా.... మిగతా పిల్లలందరికీ కథగా చెప్పాల్సిన విషయం...." నవ్వు వచ్చింది. ఇదో విజయమా? దు:ఖం, భయం తప్ప నా కథలో చెప్పుకోదగ్గ విశేషమే ముంది?

కాలేజీ డే. రంగు రంగు కాగితాలు. ఆడిటోరియం గొడవ గొడవగా, మాటలు మాటలుగా సముద్రం సముద్రంగా, కాస్త మౌనంగా ఉంటే, నా లోపల పొంగేది విషాదమో, ఆనందమో పోల్చి చూసుకుంటాను. సైలెన్స్ ప్లీజ్!

ఆడిటోరియమ్ వదిలి.... అట్లా కాలేజీ వైపుకు. వెళ్ళాను. పరిచితమైన ప్రదేశాలు. క్లాసురూముల్లోకి వెళ్ళి..... అక్కడ బెంచీలను ప్రేమగా ముట్టుకోవాలని.... కాంటీన్.... నాయర్‌కు థ్యాంక్సు చెప్పాలని.... అట్లాగే వెళ్ళి, వెళ్ళి జువాలజీ లాబ్‌లో.... ఫార్మాలిన్‌లో తేలుతున్న జంతువుల్ని బయటకు లాగి, విముక్తి నివ్వాలని.... పోగాపోగా లైబ్రరీ. దాని వెనక మినీ ఆడిటోరియం.... నర్తనశాల.... రమేష్ ఏడీ? 'కీచకుడా! ఒరే లంజకొడకా!' లోలోపల వణుకుతున్న మాటల్ని పెద్దగా పైకి అరవాలని.... "స్టూడెంట్స్ ఆర్ రిక్వెస్టెడ్ టు...." మీటింగ్ స్టార్ట్ అయినట్లుంది. వెనక్కు బయలుదేరాను. వెళుతూ, వెళుతూ, కెమిస్ట్రీ లాబ్ దగ్గర ఆగాను. లోపల వాచ్‌మన్. "గుడీవినింగ్ జకరయా!" "బాగున్నావా పాపా! బాగా చదువుతున్నావా?" "ప్రీఫైనల్‌లో కెమిస్ట్రీలో క్లాస్ ఫస్ట్ వచ్చింది" అంటూ పది రూపాయల నోటు చేతిలో పెట్టాను. అతని ముఖంలో పరవశం. అట్లాగే లాబ్‌లోకి వెళ్ళి.... అటూ ఇటూ తిరిగి..... పొగలు కక్కే సల్ఫ్యూరిక్ ఏసిడ్ బాటిల్ దగ్గర ఆగి.... "సల్ఫ్యూరీ! సల్ఫ్యూరీ! నీలా పొగలుకక్కే.... సెగలు చిమ్మే అగ్ని ప్రవాహంలా నేనెప్పుడు మారతానో?" అని అనుకుంటున్నంతలో....

"డియర్ స్టూడెంట్స్! టుడే ఈజ్ ఏ....." మీటింగు మొదలైనట్లుంది. హడావుడిగా వెనుతిరిగాను. కాలేజీ సాధించిన విజయాలు, కాలేజీ ఘనత.... కథలు కథలుగా చెబుతున్నారు. కాలేజీలను దేవాలయాలంటాడు ఒకాయన. ఒక మినీ సమాజమని ఇంకొకాయన, పర్సనాలిటీని పెంచే హ్యూమన్ లేబరేటరీలు.... ఇంకా, ఇంకా.... నిజమా? డామ్ నాన్సెన్స్! ఇవి రక్కసి పొదలు! సర్పాలయాలు! చిత్రహింసల సైనిక శిబిరాలు!

ప్రైజు డిస్ట్రిబ్యూషన్. ఫస్ట్ ఇంటర్ బైపిసి ఇంగ్లీషు క్లాస్ ఫస్ట్.... పి. లక్ష్మి.... చప్పట్లు, చప్పట్లు.... "దళిత కుటుంబం నుంచి వచ్చి వెల్ఫేరు హాస్టల్లో ఉంటూ కష్టపడి...." నన్ను పరిచయం చేస్తూ వాడే.... రమేష్! ది కీచక!

ముఖ్య అతిథి (జిల్లా జడ్జి) నాకు సర్టిఫికేటు, ప్రైజు ఇచ్చి, ప్రేమగా షేక్‌హాండ్ ఇచ్చాడు. చప్పట్లు, చప్పట్లు.... మరోసారి. ఇవి ప్రశంసలేనా? నమ్మశక్యమైనవేనా? ఎందుకో దు:ఖం వస్తోంది. తన్నుకు వస్తుంది. ఎందుకో కోపం కూడా వస్తోంది. ఒక చీకటి సాయంకాలం, హాస్టలులో

ఆ అత్యాచారం, అది మరిచిపోయారా? గోడ పైని రాతలు, అవి? కీచకుడి చెర, అది కూడా.... కాని నాకు మాత్రం మరపురావటం లేదు. దు:ఖం ఆగలేదు. పొగిలి పొగిలి ఏడుస్తూ, అట్లాగే నేలపై కూలబడి... నా హాండ్‌బేగ్‌లోంచి సెగలు సెగలుగా ఉన్న సల్ఫ్యూరిక్ ఏసిడ్ బయటకు తీసి.... "సల్ఫ్యూరీ! సల్ఫ్యూరీ! నీలా పొగలు కక్కే, సెగలు చిమ్మి.... అగ్ని ప్రవాహంలా మారి....' ' బాటిల్ రమేష్ ముఖంపై విసిరాను. వాడి అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి.

*సుప్రభాతం మార్చి, 1997*